

కుమ్మరిబస్తీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సరళ

తాగునీరు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలి

● కార్పొరేటర్ సరళ

అమీర్‌పేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కుమ్మరిబస్తీలో నెలకొన్న డ్రైనేజీ అసంపూర్తి పనులు, లో ప్రెషర్ తాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కార్పొరేటర్ కేతినేని సరళ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానికుల అభ్యర్థన మేరకు బీజేపీ కార్యకర్తలతో కలిసి మంగళవారం బస్తీని సందర్శించిన సరళ స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత అధికారులను రప్పించి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో బీజేపీ సనత్‌నగర్ నియోజకవర్గ కన్వీనర్ శ్రీశైలంగౌడ్, ఆర్.లక్ష్మణ్‌రావు, భిక్షపతిగౌడ్, రాకేష్‌గౌడ్, పవన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న కార్పొరేటర్ మహేశ్వరి

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

బేగంపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని బేగంపేట ప్రాంతానికి చెందిన వారికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను కార్పొరేటర్ టి.మహేశ్వరి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టి.శ్రీహరి, అధికారులు పాల్గొన్నారు.



మొక్కలను నాటుతున్న
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ హెడ్ ధారాసింగ్ నాయక్

కేబీఆర్ పార్కులో హరితహారం

బంజారాహిల్స్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కులో హరిత ధార కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ హెడ్ ధారాసింగ్ నాయక్ ముఖ్య అతిథిగా విచ్చేసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ సీఎస్ఆర్ కార్యక్రమాల్లో భాగంగా ఈ ఏడాది తమ జోన్ పరిధిలో ఒక్కో బ్రాంచి తరఫున ఐదు మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యతలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో తమవి 326 బ్రాంచిలు ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా కేబీఆర్ పార్కులో వంద మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏజీఎంలు సత్యవాణి, గుల్షన్ కుమార్, చీఫ్ మేనేజర్ ఎ.యెతేంద్ర, పార్కు అధికారి మంజుల తదితరులు పాల్గొన్నారు.



ప్రవాస భారతీయుడు భాస్కర్‌తో వైద్యులు

ప్రవాస భారతీయుడికి శ్వాస, హృద్రోగ సమస్య

● మూడు నెలలపాటు చికిత్స అందించిన వైద్యులు

బంజారాహిల్స్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): శ్వాస, హృద్రోగ సమస్యతో పాటు శరీర అవయవాలు పనిచేయక ఇన్ఫెక్టివ్ ఎండోకార్డిటిస్‌తో బాధపడుతున్న ప్రవాస భారతీయుడికి బంజారాహిల్స్ కేర్ వైద్యులు మూడు నెలల పాటు చికిత్స అందించి కోలుకునేలా చేశారు. భారత సంతతికి చెందిన భాస్కర్ పొనుగంటి(43) ఆస్ట్రేలియాలో నివసిస్తున్నారు. శ్వాస ఆడక పోవడంతో పాటు తీవ్రమైన హృద్రోగ సమస్యతో బంజారాహిల్స్‌లోని కేర్‌కు వెళ్లాడు. అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు అతను "ఇన్ఫెక్టివ్ ఎండోకార్డిటిస్" వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించారు. ఇలాంటి తీవ్రమైన ఇన్ఫెక్షన్ వల్ల మూత్రపిండాల వైఫల్యం, ఎడమ వైపు పక్షవాతం ఏర్పడడంతో బ్రెయిన్ స్ట్రోక్ ఏర్పడి ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. అతడిని వెంటిలేటర్ పై ఉంచి కార్డియాలజీ విభాగం అధిపతి డాక్టర్ వి.సూర్యప్రకాశరావు నేతృత్వంలో వైద్య బృందం గుండె వద్ద కవాటానికి అత్యవసర శస్త్ర చికిత్స చేశారు. అనంతరం ఆస్పత్రికి చెందిన సీనియర్ కార్డియోథొరాసిక్, హార్ట్ ట్రాన్స్ ప్లాంట్ సర్జన్ డా.నగేష్ ఆధ్వర్యంలో వైద్య బృందం "మెకానికల్ వాల్వ్" వైద్యవిధానం ద్వారా రోగి బృహద్ధమని కవాట మార్పిడిని విజయవంతంగా నిర్వహించింది. దీంతో రోగి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడింది. ఇంతలో అతడికి బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో న్యూరాలజీ, నెఫ్రాలజీ, ఇంటెన్సివిటీ, కార్డియాక్ విభాగాలు.. సమన్వయంతో నిరంతర పర్యవేక్షణలో కఠినమైన ఫిజియోథెరపీతో కూడిన బహుళ వైద్య చికిత్స విధానాలను అందించారు. రెండు వారాలపాటు శ్రమించిన అనంతరం భాస్కర్ కోలుకోవడం మొదలు పెట్టాడు. దాదాపు 75 రోజుల పాటు అన్ని విభాగాల వైద్యుల పర్యవేక్షణతో భాస్కర్ సంపూర్ణ ఆరోగ్యవంతుడయ్యాడని ఆస్పత్రి సీఓఓ సయ్యద్ క్రమాన్ తెలిపారు.

సెయిలింగ్‌లో అగ్రస్థానంలో గోవర్ధన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): తెలంగాణ మాన్‌సూన్ రెగెట్టా రెండో రోజు పోటీలు ఉత్సాహంగా జరిగాయి. మంగళవారం హుస్సేన్‌సాగర్‌లో జరిగిన ఈ పోటీల్లో అండర్-16 ఆప్టిమిస్ట్ క్లాస్ విభాగంలో హైదరాబాద్ సెయిలర్ గోవర్ధన్ 8 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. అండర్-18 అంతర్జాతీయ 420 మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో తెలంగాణ జోడీ వైష్ణవి-శ్రవణ్ జోడీ 7 పాయింట్లతో టాప్‌లో కొనసాగుతోంది.



సెయిలర్ గోవర్ధన్

నిర్లక్ష్యం ఒకరిది.. మూల్యం ఇంకొకరిది

● రోడ్డు మీదకు వెళ్లాలంటే జంకుతున్న నగరవాసులు
● ఎటు నుంచి మృత్యువు వస్తుందోనని ఆందోళన



రోడ్డు ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన కారు(ఫైల్)

"పెళ్లి చేసుకొని జీవితంలో స్థిరపడాలని ఆ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఎన్నో కళలు కంటూ నగరం నుంచి ద్విచక్ర వాహనంపై అమ్మాయిని చూసేందుకు బయలు దేరాడు. తన దారిలో తాను మామూలుగానే వెళ్తున్నాడు. అర్ధరాత్రి కావడంతో వాహనాల రద్దీ తక్కువగా ఉండడం వల్ల ఓ టిప్పర్ డ్రైవర్ తన లక్ష్యాన్ని చేరుకునేందుకు వేగం పెంచాడు. ఎదురుగా వెళ్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వాహనాన్ని ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు".

"ప్రేమించి వివాహం చేసుకున్నాడు. భార్యను బాగా చూసుకోవాలని ఉన్న ఉద్యోగం కన్నా మంచి పని వెతుక్కుంటున్నాడు. ఇంతలో ఓ కంపెనీలో అవకాశం వచ్చింది. వెంటనే దరఖాస్తు చేసుకునేందుకు జిరాక్స్ కోసం బయటకు వచ్చాడు. పని పూర్తి చేసుకొని తిరిగి వెళ్తుండగా గుర్తు తెలియని కారు ఢీ కొట్టింది. అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న భార్య స్పృహ కోల్పోయి ఆస్పత్రి పాలైంది."

ప్రమాదం.. ఎటు వైపు నుంచి ఏ రూపంలో ముంచుకు వస్తుందనేది అంతుబట్టని ప్రశ్నగా మారింది. ట్రాఫిక్ నిబంధనలు పాటించి ఇంటికి చేరతామనే గ్యారెంటీ లేకుండా పోతోంది. చెట్టుకింద నిలుచున్నా.. బస్సు సీటులో కూర్చున్నా భద్రత ఎంతంటే చెప్పడం కష్టమే. ఇదీ మహానగరంలో సామాన్యుల భద్రత ఎంతనే ప్రశ్నకు వినిపిస్తున్న సమాధానాలు.

బంజారాహిల్స్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మూడు నెలల కిందట బయటకు వచ్చిన ఓ యువకుడు తిరిగి ఇంటికి వెళ్తుండగా విద్యుత్ స్తంభానికి చేయి తగిలింది. అంతే విద్యుత్ షాక్ తగిలి మరణించాడు. ఇది జరిగిన పదిహేను రోజులకే రెహ్మత్‌నగర్‌లో బాలిక ఆడుకుంటుండగా విద్యుత్ తీగ తెగి పడడంతో షాక్‌కు గురైంది. మూడు రోజులపాటు ఆస్పత్రిలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడి చివరకు మృత్యువును జయించలేక కన్ను మూసింది. కన్న వారి కళ్ల ముందే ఇదంతా జరగడంతో వారి కడుపుకోత మిగతా వారిని కన్నీరు పెట్టించింది. రెండు నెలల కిందట మెట్రో స్లాబ్ కింద నిలబడ్డ ఓ యువతి తలపై నిర్మాణ పెచ్చులు ఊడి పడ్డాయి. ఖైరతాబాద్ వద్ద బస్సులో ప్రయాణిస్తున్న ఓ యువకుడు రెప్పపాటులో మరో బస్సులోని ఇనుపరాడ్డు.. గొంతులో దిగి ప్రాణాలు పోగొట్టుకున్నాడు. కారణాలు ఏవైనా ఎవరో చేసిన తప్పుకు అమాయకులు బలవుతున్నారు. కుటుంబాలు జీవన ఆధారాలను కోల్పోతున్నాయి.

నష్టపరిహారంతో సరిపెట్టే ప్రయత్నాలు..

భవన నిర్మాణాల్లో పని చేసే కార్మికులు శిథిలాల కింద సమాధి అయిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. నిర్మాణదారుడు ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా చేసే పనుల కారణంగా కూలీల జీవితాలు అంతం అవుతున్నాయి. అయితే, నిర్మాణదారులు మాత్రం నష్టపరిహారం కింద కొంత డబ్బు ఇచ్చి రాజీ కుదుర్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. వారి నిర్లక్ష్యం తగ్గ శిక్ష పడడం లేదన్నది అందరికీ తెలిసిన విషయమే. ఇటీవల పశ్చిమ మండలం పరిధిలో జరిగిన ఓ ప్రమాదంలో ఇద్దరు కూలీలు మరణించారు. వారి కుటుంబాలకు కొంత మేరకు నష్టపరిహారం ఇచ్చారు. నిర్మాణదారులపై మాత్రం చిన్నపాటి కేసులు పెట్టి వదిలేశారు. ఎవరిది నిర్లక్ష్యం.. ఎవరిది బాధ్యత.. ఎవరికి శాపం అన్న విషయంపై ఇంత వరకు ఎవరూ దృష్టి సారించలేకపోయారు. గతంలో రోడ్డు ప్రమాదాల్లో పోలీసులు విచారణ పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేసినా ఇంత వరకు నిందితులకు కోర్టుల్లో శిక్ష ఖరారు కాని ఘటనలు అనేకం ఉన్నాయి.

వేగం, మద్యం మత్తు..

అతి వేగం, మద్యం మత్తు కారణంగా అనేక మంది మృత్యువాత పడ్డారు. ఈ ఘటనలతో రోడ్డు భద్రతపై అనుమానాలు వెల్లువెత్తాయి. రోడ్ల డిజైన్‌లపై కూడా విమర్శలు తలెత్తాయి. ప్రభుత్వం కూడా కంటితుడుపు చర్యలో భాగంగా కొన్ని మార్పులు చేర్పులు చేసింది. కానీ, ఏం లాభం రమ్య ఘటన జరిగిన ప్రాంతంలో గడిచిన నాలుగు సంవత్సరాల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఐదుగురు క్షతగాత్రులుగా మిగిలారు. ఈ ప్రమాదాలన్నిటికీ కారణం అతి వేగం. తాజాగా బంజారాహిల్స్ రోడ్డు నంబరు.12లో జరిగిన రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతిచెందిన సంఘటనలో కూడా అతి వేగం, నిర్లక్ష్యమే ప్రధాన కారణం అని తేలింది. ఈ వేగానికి కళ్లెం వేయడానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి.

నిర్లక్ష్యం మాటున..

నిర్మాణాలు చేపట్టినా, రోడ్డు మీద వాహనాలు నడిపినా మరో పనిచేసినా.. చేసే వారి నిర్లక్ష్యం కారణంగా నిండు ప్రాణాలు బలవుతున్నాయి. కృష్ణానగర్‌లో విధి దీపాల నిర్వహణ విషయంలో అధికారులు, గుత్తేదారు నిర్లక్ష్యంగా దాగి ఉంది. వారి తప్పిదం కారణంగా షార్ట్‌సర్క్యూట్ ఏర్పడడం వల్లే ప్రమాదం జరిగిందని నిర్ధారణ కూడా అయింది. పోలీసులు ఐపీసీ 304(ఎ) కింద కేసు నమోదు చేశారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు ఇటు వీధి దీపాల నిర్వహణ చూసే జీహెచ్ఎంసీగానీ, గుత్తేదారుగానీ పట్టించుకోలేదు. పై పెచ్చు తమ తప్పేం లేదన్నట్టు వ్యవహరించడం విస్మయానికి గురిచేసింది. మరో రోడ్డు ప్రమాదం విషయంలో నిందితుడైన కారు డ్రైవర్ ప్రమాదం సమయంలో తాను లేనని బుకాయించాడు. కేసు నమోదు చేశారు కదా కోర్టులో చూసుకుందామంటూ నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించారు. వీరికి శిక్ష పడేది లేనిది కొన్నిసంవత్సరాలు గడిస్తేగాని తెలియదు. కానీ, వీరి తప్పిదం కొన్ని కుటుంబాల్లో విషాదఛాయలు నింపుతున్నాయి.

ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

● ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

బోరబండ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన వినతులను సత్వరమే పరిష్కరించాలని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం బోరబండ సైట్-3 ప్రొఫెసర్ జయశంకర్ సార్ సామాజిక భవన్‌లో ఎమ్మెల్యే మాగంటి అధ్యక్షతన సమస్యలపై శంఖారావం జరిగింది. ప్రజలు సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాకాలంలో జలమండలి, సివరేజ్ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. మ్యాన్‌హోళ్లు, నాలాల పూడికతీత, వ్యర్థాలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రేషన్ బియ్యం పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ప్రభుత్వ స్థలాలను విధిగా రెవెన్యూ అధికారులు కాపాడాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు కిరణ్, రామచంద్రరాజు, గిరిధర్, సరస్వతి, సాయితేజ, వేణు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కృష్ణమోహన్, విజయ్‌కుమార్, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలపై శంఖారావానికి హాజరైన మహిళలు



ప్రజల నుంచి దరఖాస్తును స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మాగంటి

సీఎంతో సమానంగా డిప్యూటీ సీఎం ఫొటోను పెట్టాలి

● ప్రభుత్వ పనితీరుపై మండిపడ్డ మోత్కుపల్లి

అమీర్‌పేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో సమానంగా ప్రభుత్వ కార్యాలయాల్లో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఫొటో పెట్టాలని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ నిరుద్యోగుల సమావేశం ఆయన నివాసంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం ఉచిత బస్సు తప్ప ఇతర పథకాలు అమలు కాలేదన్నారు. 30 సార్లకు పైగా ఢిల్లీ ప్రయాణాలు చేసిన రేవంత్‌రెడ్డి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని, అనుభవం లేని నాయకుడికి సీఎం పదవి కట్టబెడితే గిట్లనే ఉంటుందని విమర్శించారు. డీఎస్సీని తక్షణమే సీఎం వాయిదా వేయాలన్నారు. తాము అధికారంలోకి రాగానే రెండు లక్షల రుణమాఫీ చేసి తీరుతామని హామీ ఇచ్చి నేడు కొర్రీలు పెడుతున్నారని విమర్శించారు. నిజాయితీగా ఉన్నందుకే తనకు ఎమ్మెల్యే, ఎంపీగా అవకాశం రాలేదన్నారు. తెలుగు రాష్ట్రాల్లో 40 సంవత్సరాలుగా ప్రజలకు సేవలందించినట్లు గుర్తు చేశారు.

నష్టాలు వస్తున్నాయని విద్యుత్ ప్రైవేటీకరణ వద్దు

పంజాగుట్ట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పాతబస్తీలో విద్యుత్ బిల్లు వసూలు కావడం లేదని, నష్టాలు వస్తున్నాయనే సాకుతో ప్రైవేటీకరణ చేసి కార్మికుల పొట్ట కొట్టవద్దని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్(1535) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.ప్రమోద్ కుమార్, కె.శ్రీనివాస్ కోరారు. మంగళవారం జీటీఎస్ కాలనీలోని యూనియన్ కార్యాలయంలో వారు మాట్లాడారు. 29 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు విద్యుత్ కార్యాలయాలు, సబ్‌స్టేషన్లలో పని చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం కొంతమంది ఆర్టిజన్‌లను రెగ్యులర్ చేసి వారికి రెండు రూల్స్ పెట్టిందన్నారు. కార్మికులను, ఉద్యోగులను విడదీసేలా ఉన్న రెండు విధానాలను తొలగించాలని అన్నారు. మీటర్ రీడర్స్, స్టోర్ కీపర్లను కూడా రెగ్యులరైజ్ చేయాలన్నారు. ఈపీఎఫ్, జీపీఎఫ్‌లను 1999 వరకు ఇచ్చి నిలిపివేశారని, మిగిలిన శాఖల్లో మాత్రం 2004 వరకు ఉన్న ఎంప్లాయిస్‌కు వర్తింపజేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో యూనియన్ కోశాధికారి కె.లింగం, రాష్ట్ర మీటర్ రీడర్స్ యూనియన్ కోశాధికారి శ్రీనివాస్, రాజు, వసంత పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రమోద్ కుమార్, శ్రీనివాస్

సంగీతం సర్వరోగ నివారిణి

రవీంద్రభారతి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): చక్కటి స్వరాలతో తెలుగు సినీ గీతాలను ఆలపించిన గాయనీగాయకులు వీనులవిందును పంచారు. మంగళవారం రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో మనిష కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పాటే నా ప్రాణం శీర్షికన సంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా కళాపోషకులు గోపీకృష్ణ దంపతులను ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ సినీ నటుడు తనికెళ్ల భరణి మాట్లాడుతూ.. కళలు, కళాకారులను ప్రోత్సహించే కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సంగీతం సర్వరోగ నివారిణి అని అన్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు సాలూరి కోటి, తుమ్మలపల్లి రామసత్యనారాయణ, కె.శ్రీనివాస్, చంద్రశేఖర్, దైవజ్ఞశర్మ తదితరులు కళాకారులను అభినందించారు. సభకు ముందు ప్రముఖ గాయకుడు మధుబాపు నేతృత్వంలోని గాయకుల బృందం పాటే నాప్రాణం పేరిట ఆలపించిన గీతాలాపన ప్రేక్షకులను అలరించింది.



గోపీకృష్ణ దంపతులను సత్కరించిన తనికెళ్లభరణి తదితరులు

'ప్రతీ పాఠశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి'

హైదరాబాద్ సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రతీ పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలలను ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకొని పోలీస్‌స్టేషన్ల ద్వారా సమీక్షించాలని ఆమె అన్నారు. బోడుప్పల్‌లోని ఓ ప్రైవేట్ అంతర్జాతీయ పాఠశాలలో డ్యాన్స్ టీచర్‌గా పనిచేస్తున్న వ్యక్తి ఒకటో తరగతి చదువుతున్న విద్యార్థినిపై లైంగికదాడి చేసిన విషయం తెలుసుకుని మంగళవారం అక్కడకు వెళ్లారు. విద్యార్థినుల భద్రతపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల ప్రాంగణంలో విద్యార్థుల రక్షణ కోసం ఉండాల్సిన సీసీ కెమెరాలు, సెక్యూరిటీ లేదని ఆమె ఆరోపించారు.

'గౌడ సొసైటీలకు భూమి కేటాయించాలి'

కవాడిగూడ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం పేరుతో కిట్లను పంపిణీ చేయడం కాదని, గీత కార్మికుల సంక్షేమం కోసం సొసైటీలకు ప్రభుత్వ భూమిని కేటాయించి తాటి, ఈత వనాలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రంగరాజ్‌గౌడ్ డిమాండ్ చేశారు.

రేషన్‌బియ్యం పట్టివేత

బంజారాహిల్స్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): బ్లాక్ మార్కెట్‌కు తరలించేందుకు నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసులు సీజ్ చేశారు. బంజారాహిల్స్ సయ్యద్‌నగర్‌కు చెందిన సయ్యద్ సిద్దిఖీ రేషన్ షాపు నుంచి బియ్యం తీసుకువచ్చి వాటిని అధిక ధరకు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తుంటాడు. సమాచారం అందుకున్న బంజారాహిల్స్ ఎస్ఐ రాంబాబు తన సిబ్బందితో దాడి చేసి సిద్దిఖీని అదుపులోకి తీసుకున్నాడు. అతడి ఇంట్లో ఉన్న 2015 టన్నుల బియ్యం సీజ్ చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి టీజీఈ సెట్ ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్

● 18 వరకు వెబ్ ఆప్షన్లు
● 21న సీట్ల కేటాయింపు

హైదరాబాద్ సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): టీజీఈ సెట్ తుదిదశ కౌన్సెలింగ్ ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభం కానుంది. కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా ధ్రువ పత్రాల పరిశీలన నిమిత్తం మొదటిదశలో ఆరు హెల్ప్‌లైన్ కేంద్రాలు(హెచ్ఎల్‌సీ) ఏర్పాటు చేసిన సాంకేతిక విద్యాశాఖ అధికారులు రెండో దశ(ఫైనల్)లో హెచ్ఎల్‌సీలను సగానికి సగం తగ్గించారు. మొదటి దశ కౌన్సెలింగ్‌కు హాజరు కాని అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలన నిమిత్తం నగరంలో ఏర్పాటు చేసిన మాసబ్‌ట్యాంక్, మారేడ్‌పల్లి, రామంతాపూర్ పాలిటెక్నిక్‌లలోని హెచ్ఎల్‌సీల్లో హాజరు కావాల్సి ఉంటుంది. 18 వరకు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవచ్చని, 21న సీట్ల కేటాయింపు ఉంటుందని సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన పేర్కొన్నారు.

తాగునీరు పట్టుకుంటున్న వ్యక్తిపై మెట్రో భద్రతా సిబ్బంది దాడి

బంజారాహిల్స్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి మందులు వేసుకునేందుకు మెట్రో స్టేషన్‌లో వాటర్ బాటిల్‌లో నీరు పట్టుకుంటుండగా భద్రత సిబ్బంది ఒకరు అతడిపై దాడి చేశాడు. వారాసిగూడకు చెందిన తందూరి సాయిప్రసన్న ప్రైవేట్ ఉద్యోగి. ఆయన పని మీద ఈ నెల 15న మాదాపూర్‌కు మెట్రోలో వచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ముందులు వేసుకునేందుకు వాటర్ బాటిల్‌లో నీరు పట్టుకుంటుండగా వెనక నుంచి సెక్యూరిటీ సూపర్‌వైజర్ వచ్చి అడ్డుకున్నాడు. నీరు తాగేందుకు గ్లాసు మాత్రమే వాడాలన్నాడు. దీనికి ప్రసన్న సమాధానం చెప్పేలోపే గట్టిగా అరిచి బెదిరించాడు. అనంతరం ప్రసన్న పై దాడి చేసి ల్యాప్‌టాప్‌ను పగలకొట్టి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ చలానా తప్పించుకునేందుకు నకిలీ నంబర్ ప్లేట్

బంజారాహిల్స్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ చలానా నుంచి తప్పించుకునేందుకు ఓ వ్యక్తి తన ద్విచక్ర వాహనానికి నకిలీ నంబర్ ప్లేట్ అమర్చాడు. అనుకొని పరిణామంలో పోలీసులకు చిక్కాడు. మార్చి 23న బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న నితిన్ అనే యువకుడిని ఆపి శ్వాస పరీక్ష చేయగా బీఏసీ 107 వచ్చింది. దీంతో పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకొని నితిన్‌ను కౌన్సెలింగ్‌తోపాటు కోర్టులో హాజరుకావాలని సూచించారు. ఆ తర్వాత నితిన్ స్పందించలేదు. ట్రాఫిక్ పోలీసులు వాహన నంబర్ ద్వారా యజమానిని పట్టుకునేందుకు ప్రయత్నించగా అది నకిలీదని తేలింది. ఇదిలా ఉండగా,

నల్గొండ జిల్లాకు చెందిన సురిమిత్తి శివాజీ రెండు రోజుల క్రితం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి వాహనం తనదేనని చెప్పాడు. స్నేహితుడైన నితిన్‌కు ఇచ్చినట్టు చెప్పాడు. కాగా, పోలీసులు నకిలీ నంబర్ ప్లేట్ గురించి అతడిని ప్రశ్నించగా ట్రాఫిక్ చలానా నుంచి తప్పించుకునేందుకు తానే అలా మార్చినట్టు ఒప్పుకున్నాడు. ట్రాఫిక్ పోలీసులు వాహనాన్ని, శివాజీని బంజారాహిల్స్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్‌ఫోరెన్సిక్ అకౌంటింగ్ పై అవగాహన అవసరం

● రైల్వే బోర్డు మెంబర్ రూపశ్రీనివాసన్

హైదరాబాద్, జులై 16 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత డిజిటలైజ్డ్ యుగంలోవాస్తవ పరిస్థితులను గుర్తించేందుకు ఫోరెన్సిక్ అకౌంటింగ్, డిజిటల్ సైబర్‌ఫోరెన్సిక్స్‌పై ప్రాథమిక పరిజ్ఞానం అవసరమని రైల్వేబోర్డు మెంబర్ (ఫైనాన్స్)రూపశ్రీనివాసన్ అన్నారు. ఇప్పటి కాలంలో డిజిటలైజ్డ్ డేటా తారుమారు చేయడం సులభమని పేర్కొన్నారు. తారుమారు చేసిన, తప్పుడు డేటాను కనుక్కోవడానికి ఫోరెన్సిక్ అకౌంటింగ్, డిజిటల్ సైబర్ ఫోరెన్సిక్స్‌పై అవగాహన ఉండాలని, ఐపాస్, ట్రాఫిక్ ఖాతాలపై కొత్త అప్లికేషన్‌ల గురించి తగిన పరిజ్ఞానం ఉండాలని పేర్కొన్నారు. ఇండియన్ రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ (ఐ.ఆర్.ఐ.ఎఫ్.ఎం) ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో జరిగిన "ఫోరెన్సిక్ అకౌంటింగ్, కార్పొరేట్ ఫైనాన్స్ అకౌంటింగ్"పై ఐ.ఆర్.ఏ.ఎస్ అధికారులకు ఏర్పాటుచేసిన శిక్షణ తరగతులను రూపశ్రీనివాసన్ ప్రారంభించారు. కార్పొరేట్ సంస్థల ఆర్థిక నివేదికల గురించి లోతైన అవగాహన, అర్థం చేసుకునే సామర్థ్యాన్ని పెంచుకునే ప్రధాన లక్ష్యంగా ఈఫ్లాగ్‌షిప్‌కోర్సును రూపొందించినట్టు ఐ.ఆర్.ఐ.ఎఫ్.ఎండైరెక్టర్ జనరల్ అపర్ణ గార్గ్ తెలిపారు.చార్టర్డ్ అకౌంటెంట్లు, సీ.ఆర్.ఐ.ఎస్, సీఅండ్ ఏజీ కార్యాలయంలోని సీనియర్ అధికారులకు శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. ఐ.ఆర్.ఐ.ఎఫ్.ఎం అడిషనల్ డైరెక్టర్ జనరల్. బి.సింగయ్య 60గంటలపాటు నిర్వహిస్తున్న ఈ కోర్సు వివరాలను వివరించారు. ప్రారంభ సమావేశంలో జోనల్ రైల్వేల ప్రిన్సిపల్ ఫైనాన్షియల్ అడ్వైజర్లు రైల్వే బోర్డు సీనియర్ ఫైనాన్స్ అధికారులు పాల్గొన్నారు.



కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్, అధికారులతో మాట్లాడుతున్న శ్రీగణేష్

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

● కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

సికింద్రాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో కంటోన్మెంట్ అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ అన్నారు. మంగళవారం కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో కంటోన్మెంట్ ముఖ్యకార్యనిర్వహణాధికారి డి. మధుకర్ నాయక్ తదితర అధికారులతో ఆయన సమావేశమయ్యారు. వర్షాకాలంలో తలెత్తే ఇబ్బందులు, వాటిని అధిగమించడానికి తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. మంచినీరు, రోడ్లు, డ్రైనేజీ సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. సమస్యల పరిష్కారానికి, చేపట్టవలసిన అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి తీసుకురావలసిన నిధుల గురించి చర్చించారు.

రేపటి నుంచి యశ్వంత్‌పూర్- కాచిగూడ వందేభారత్ వేళల్లో మార్పు

మహబూబ్‌నగర్ స్టేషన్‌కు మాత్రమే వర్తింపు

హైదరాబాద్ సిటీ, జూలై 16(ఆంధ్రజ్యోతి): యశ్వంత్‌పూర్ నుంచి కాచిగూడ వచ్చే వందేభారత్ (20704) ఎక్స్‌ప్రెస్ వేళ్లలో స్వల్ప మార్పులు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. అయితే, ఈ మార్పు మహబూబ్‌నగర్ స్టేషన్‌కు మాత్రమే వర్తిస్తుందని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ స్టేషన్‌కు రాత్రి 9.04గంటలకు రావాల్సిన వందేభారత్ ఈనెల 18 నుంచి రాత్రి 9.26గంటలకు చేరుకుంటుందని వెల్లడించారు.

నేటి నుంచి టీజీఈ సెట్ ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్

18 వరకు వెబ్ ఆప్షన్లు.. 21న సీట్ల కేటాయింపు

హైదరాబాద్ సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): టీజీఈ సెట్ తుదిదశ కౌన్సెలింగ్ ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభం కానుంది. కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా ధ్రువపత్రాల పరిశీలన నిమిత్తం మొదటిదశలో ఆరు హెల్ప్‌లైన్ కేంద్రాలు (హెచ్ఎల్‌సీ) ఏర్పాటు చేసిన సాంకేతిక విద్యాశాఖ అధికారులు రెండోదశ(ఫైనల్)లో హెచ్ఎల్‌సీలను సగానికి సగం తగ్గించారు. మొదటి దశ కౌన్సెలింగ్‌కు హాజరుకాని అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలన నిమిత్తం నగరంలో ఏర్పాటు చేసిన మాసబ్‌ట్యాంక్, మారేడ్‌పల్లి, రామంతాపూర్ పాలిటెక్నిక్‌లలోని హెచ్ఎల్‌సీల్లో హాజరు కావాల్సి ఉంటుంది. 18 వరకు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవచ్చని, 21న సీట్ల కేటాయింపు ఉంటుందని సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన పేర్కొన్నారు.

మోదీ సర్కారుతోనే కంటోన్మెంట్ అభివృద్ధి

బీ.ఎన్.శ్రీనివాస్



మీడియాతో మాట్లాడుతున్న బీజేపీ అధికార ప్రతినిధి బి.ఎన్.శ్రీనివాస్


సికింద్రాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని మోదీ సర్కారుతోనే సికింద్రాబాద్ కంటోన్మెంట్ అభివృద్ధి సాధ్యమని బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధికార ప్రతినిధి బి.ఎన్.శ్రీనివాస్ అన్నారు. గతంలోని కేసీఆర్ ప్రభుత్వంగాని, ప్రస్తుత రేవంత్‌రెడ్డి ప్రభుత్వంగాని కంటోన్మెంట్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆయన విమర్శించారు. తాడ్‌బందులో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రస్తుతం కంటోన్మెంట్ కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి చెందుతున్నదని, కేంద్రంలో మోదీ సర్కారు, కంటోన్మెంట్‌లో బీజేపీ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ ఉండడమే దీనికి కారణమని అన్నారు. ముఖ్యంగా గడిచిన రెండున్నర సంవత్సరాలుగా అన్ని కాలనీలు, బస్తీల్లో అమోఘమైన అభివృద్ధి జరిగిందని శ్రీనివాస్ పేర్కొన్నారు. కాగా రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వద్ద మార్కులు కొట్టేయాలన్న తపనతో కంటోన్మెంట్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు అయూబ్‌ఖాన్, జలీల్‌లు రామకృష్ణ పనితీరుపైన, బీజేపీపైన లేనిపోని విమర్శలు చేస్తున్నారని ఆయన ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో రామకృష్ణ హైకోర్టుకు వెళ్లి, కంటోన్మెంట్‌కు రావలసిన టీపీటీ బకాయిలు వసూలు చేశారని తెలిపారు. కాంగ్రెస్ నాయకులకు కూడా చిత్తశుద్ధి ఉంటే రేవంత్‌రెడ్డితో మాట్లాడి నిధులు తీసుకురావాలని ఆయన అన్నారు.

సికింద్రాబాద్‌లోని పద్మారావునగర్‌లో..

సాయిబాబా సప్తాహ మహోత్సవాలు



పద్మారావునగర్‌లోని శ్రీసాయిబాబా ఆలయం



పుష్పాలతో అలంకరించిన సాయిబాబా విగ్రహం

పద్మారావునగర్, జులై, 16 (ఆంధ్రజ్యోతి): సికిందరాబాద్, పద్మారావునగర్‌లో గల శ్రీ షిరిడీ సాయిబాబా దేవాలయంలో గురుపౌర్ణమిని పురస్కరించుకొని జూలై 15 సోమవారం మొదలుకొని 21వ తేదీ ఆదివారం వరకు ఏడు రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలను అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వారు తెలియజేశారు. సాయి సప్తాహ వేడుకలలో భాగంగా 15వ తేదీన శ్రీ సాయి రుద్రసేవ 16న శ్రీ సాయి ధన్వంతరీసేవ నిర్వహించారు. 17న శ్రీ సాయి సిద్ధి వినాయకసేవ, శ్రీ సాయి విష్ణుసహస్రనామసేవ, 18న శ్రీ సాయి స్వర్ణాభిషేకం. 19న శ్రీ సాయి పంచఫల రసాభిషేకం, శ్రీ సాయి అష్టలక్ష్మి సేవ, 20న పంచముఖ ఆంజనేయసేవ, 21వ తేదీన శ్రీ సాయి కుంభాభిషేకం (108 కలశాలతో) నవగ్రహపూర్వక మహామృత్యుంజయహోమము జరుగుతాయని ఆలయ కమిటీ తెలియజేసింది.

ఆషాఢ బోనాల జాతరకు సర్వం సిద్ధం



బోనాల జాతరకు ముస్తాబైన ఆలయం



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ రష్మీ పెరుమాళ్

తిరుమలగిరి, జులై 16 (ఆంధ్రజ్యోతి) : తిరుమలగిరి బొల్లారంలోని అమ్మవారి దేవాలయాలను ఆషాఢ మాసం బోనాల జాతరకు నిర్వాహకులు ముస్తాబు చేస్తున్నారు. బొల్లారంలోని తోట ముత్యాలమ్మ దేవాలయం సదర్ బజార్‌లోని మహంకాళి దేవాలయాలను నిర్వాహకులు వివిధ రంగులతో అమ్మవారి రూపాలను వేస్తూ సర్వం సిద్ధం చేస్తున్నారు. తోట ముత్యాలమ్మ దేవాలయంలో ఈనెల 28న బోనాల ఉత్సవ వేడుకల సందర్భంగా ఉదయం 5గంటలకు చండీ యాగం, కుంకుమార్చనలు లాంటి ప్రత్యేక పూజలు జరుగుతాయని ప్రధాన అర్చకులు చిక్కాల మహేష్ కుమార్ తెలిపారు. అదేవిధంగా అరుణ్ స్వామి శ్రీ సిద్ధి వినాయక భజన పార్టీ వారిచే భజన కార్యక్రమం సాయంత్రం జరుగుతుందని, ఘటం కార్యక్రమం కూడా కొనసాగుతుందని తెలిపారు. అమ్మవారికి పల్లకీ సేవ, శాంతి పూజ, మహా నైవేద్యం, దివ్యమంగళ హారతి లాంటి పూజలు జరుగుతాయని తెలిపారు. 28వ తేది సోమవారం ఉదయం 5గంటలకు అభిషేకం, కుంకుమార్చన, నైవేద్యం, మంగళహారతి, పుష్పార్చన లాంటి ప్రత్యేక పూజలు జరుగుతాయని తెలిపారు. అదేవిధంగా మంగళవారం 30వ తేదిన మధ్యాహ్నం 1గంట నుంచి 3గంటల వరకు అన్నప్రసాదం కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. బోనాల ఉత్సవ వేడుకలకు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకోవాలని చిక్కాల మహేష్ కోరారు. సదర్ బజార్ మహంకాళి అమ్మవారి దేవాలయంలో కూడా నిర్వాహకులు సర్వం సిద్ధం చేస్తున్నారు. వివిధ ఏర్పాట్లలో పనులు జరుగుతున్నాయి.

బోనాల జాతర సాఫీగా సాగేలా చర్యలు

రాంగోపాల్‌పేట్ : లక్షలాది మంది భక్తులు పాల్గొనే సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళి ఆషాఢ బోనాల జాతర సాఫీగా ప్రశాంతంగా సాగేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఉత్తర మండల డీసీపీ రష్మీ పెరుమాళ్ అన్నారు. మంగళవారం మహంకాళి పోలీస్ స్టేషన్‌లో అదనపు డీసీపీ, మహంకాళి ఏసీపీ సర్దార్ సింగ్, ఇన్‌స్పెక్టర్ పరశురామ్‌లతో కలిసి స్థానిక విలేకరులతో ఆమె సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... విలేకరులు కూడా అన్ని శాఖల అధికారులు, పోలీసులతో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వీవీఐపీలు ఆలయానికి వచ్చే సమయంలో సాధారణ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని, జాతరలో దాదాపు 10లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకునే అవాకాశం ఉందని, దీనివల్ల నిమిషానికి కనీసం 600మంది భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు, అందుకోసం ఆరు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నామని, దేవాలయం వెనుకవైపు నుంచి కల్యాణమండపంలో నుంచి అమ్మవారిని దర్శించుకునేలా వీఐపీల కోసం కొత్తగా ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

ఘనంగా ఘటాల ఊరేగింపు



లష్కర్ యావత్తూ బోనాల శోభతో కళకళలాడుతోంది. సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆలయంతోపాటు సోమసుందరం వీధిలోని శ్రీదేవి పోచమ్మ ఆలయం. ముత్యాలమ్మ ఆలయం తదితర దేవాలయాల్లో ఈనెల 21, 22వ తేదీల్లో బోనాల జాతర జరగనున్న నేపథ్యంలో ఘటాల ఊరేగింపు ప్రతి రోజూ ఘనంగా సాగుతోంది. మంగళవారం శ్రీదేవి పోచమ్మ ఆలయం సమీపంలో మూడు ఘటాలకు శివనారాయణగుప్తా తదితర భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు.

(సికింద్రాబాద్-ఆంధ్రజ్యోతి)



ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, సీఐటీయూ నాయకులు

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలను పరిష్కరించాలి

● సీఐటీయూ నాయకులు

బౌద్ధనగర్, జులై 16 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ నాయకులు, టీచర్స్ సికింద్రాబాద్ శాసనసభ్యుడు తీగుళ్ల పద్మారావుగౌడ్‌ను మద్దతు కోరారు. మంగళవారం పద్మారావుగౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర నాయకుడు టి.మహేందర్, నర్సమ్మ, ఈశ్వరి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లకు రంగులు

తిరుమలగిరి, జులై 16 (ఆంధ్రజ్యోతి): బొల్లారం చింతల్ బజార్‌లోని ప్రధాన రోడ్డు మీద ఉన్న స్పీడ్ బ్రేకర్ మీదుగా వెళుతున్న ద్విచక్ర వాహనదారులు నిత్యం కింద పడిపోతున్నారు. దీంతో వాహనదారులకు తీవ్ర గాయాలు అవుతున్నాయి. ప్రతి రోజు నాలుగు నుంచి అయిదు వాహనదారులు కిందపడిపోయి గాయాలపాలవుతున్నారు. అయితే వారికి స్పీడ్ బ్రేకర్ తెలియడంలేదా, వాహనం స్పీడ్‌గా నడిపి వెళ్లి పడిపోతున్నారా అనే చర్చ కొంత కాలంగా జరుగుతుంది. విషయం తెలుసుకున్న టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కే.నరసింహన్ మంగళవారం స్పీడ్ బ్రేకర్‌ను గుర్తుపట్టేవిధంగా తన సొంత నిధులు వెచ్చించి స్పీడ్ బ్రేకర్‌పై పసుపు రంగు పెయింట్‌ను వేయించారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జీ.వీ. బాల్‌రాజ్, సతీష్, సుశీల్, శివ పాల్గొన్నారు.

రైలు ఢీకొని రైల్వే ట్రాక్‌మ్యాన్ మృతి



మహేందర్‌రెడ్డి (ఫైల్)

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ట్రాక్ పనులు ముగించుకుని వస్తున్న ఓ రైల్వే ట్రాక్‌మ్యాన్‌ను రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మౌలాలి సమీపంలో చోటుచేసుకుంది.

సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... రైల్వే ట్రాక్‌మ్యాన్‌గా పనిచేస్తున్న మహేందర్‌రెడ్డి మంగళవారం డ్యూటీ ముగించుకుని రైలు పట్టాల పక్కనుంచి నడుచుకుంటూ వస్తుండగా గుర్తుతెలియని రైలు ఢీకొని బలమైన గాయాలతో అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

మజ్దూర్ యూనియన్ ఆర్థిక సహాయం

ట్రాక్‌మ్యాన్ మహేందర్‌రెడ్డి కుటుంబానికి మజ్దూర్ యూనియన్ అండగా ఉంటుందని మజ్దూర్ యూనియన్ డివిజనల్ సెక్రటరీ రవీందర్ తెలిపారు. సోమవారం మౌలాలి యూనిట్‌లో విధులు ముగించుకుని ఇంటికి వెళుతూ రైలు ఢీకొని మృతి చెందిన మహేందర్‌రెడ్డి మరణం బాధాకరం అన్నారు. యూనియన్ తరుపున రూ.2లక్షల రూపాయలు ప్రకటించగా, తక్షణ సాయంగా రూ.50వేలు వారి కుటుంబ సభ్యులకు అందించినట్లు తెలిపారు. అదేవిధంగా సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ తరుపున పది వేల రూపాయలు అందించినట్లు సొసైటీ అధ్యక్షుడు, మజ్దూర్ యూనియన్ అసిస్టెంట్ డివిజన్ సెక్రటరీ చిలుకస్వామి తెలిపారు. మృతుడి కుటుంబానికి యూనియన్ అన్నివిధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ కోశాధికారి నరసింహారెడ్డి, బ్రాంచ్ చైర్మన్ కుమారస్వామి పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం



సీ.హెచ్. పద్మ

మారేడుపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో పరిస్థితుల కారణంగా కలతచెందిన మారేడుపల్లి సంజీవయ్య నగర్‌కు చెందిన 60సంవత్సరాల వృద్ధురాలు సీ.హెచ్.పద్మ ఈనెల 8న ఇంట్లో నుంచి వెళ్లి తిరిగిరాలేదు. భర్త రాజయ్య రిహాబిలిటేషన్‌లో చికిత్స పొందుతున్నారు. ఆచూకీ దొరకకపోవడంతో మంగళవారం మారేడుపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆమె కూతురు ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

ఇంట్లో పనిచేసే సర్వెంట్ అదృశ్యం



పేరుక సురేష్

మారేడుపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పికెట్‌లో నివాసముండే పేరుక సురేష్ (35) ఈనెల 10న ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. గోదావరికి చెందిన భార్యాభర్తలు జీవనోపాధి కోసం కొన్నేళ్ల క్రితం వలస వచ్చి పికెట్‌లో నివాసం ఉంటున్నారు. సురేష్ ఆచూకీ లభించకపోవడంతో భార్య మంగళవారం మారేడుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో నేపాలీవాసి మృతి



మృతి చెందిన నేపాలివాసి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : రైల్వే స్టేషన్‌లో అనారోగ్యంతో ఓ నేపాలి ప్రయాణికుడు మృతి చెందాడు. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాలు ప్రకారం మంగళవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫాం నెంబరు 1పై పబ్లిక్ టాయిలెట్ వద్ద గుర్తుతెలియని 55 ఏళ్ల వ్యక్తి చనిపోయి ఉండగా సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు నేపాలీకి చెందిన వాడిగా రైల్వే పోలీసులు భావిస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిస్తే 87126585814, 8712568516 నెంబరుకు సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు కోరారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఓయూ ఖ్యాతిని మరింత పెంపొందింపజేయాలి

● ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. లక్ష్మీనారాయణ



క్యాంపస్ ప్లేస్‌మెంట్ సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ

తార్నాక, జూలై 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత రంగాల్లో స్థిరపడటంతో పాటు, ఉస్మానియా యూనివర్సిటీ ఖ్యాతిని మరింత పెంపొందింపజేయాలని ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ అన్నారు. ఓయూ ఎంబీఏ, టెక్నాలజీ మేనేజ్‌మెంట్ విభాగంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లను సాధించిన విద్యార్థులను, అధ్యాపకులను ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ మంగళవారం ఓయూ పరిపాలనా భవనంలో ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రతినిధులు ఎంపికయిన విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఓయూ ఎంబీఏ, టెక్నాలజీ మేనేజ్‌మెంట్ విభాగానికి చెందిన 17 మంది విద్యార్థులకు ఒకేసారి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకింగ్ రంగంలో మేనేజర్ స్థాయి ఉద్యోగాలు రావడం గర్వించదగ్గ విషయమన్నారు. అనంతరం ఎంబీఏ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొ. శ్రీరాములు మాట్లాడుతూ ఎంబీఏ, టెక్నాలజీలో 4వ సెమిష్టర్ చదువుతున్న 120 మంది విద్యార్థులలో 109 మంది విద్యార్థులకు ప్రముఖ కంపనీలలో ఉద్యోగాలు సాధించారని తెలిపారు. డీన్ ప్రొ.వెంకటయ్య, హెచ్‌ఓడీ ప్రొ.సుధా, చైర్మన్ స్మిత, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జహంగీర్, డా.విద్యాసాగర్ రావు, డా.సమున్నత పాల్గొన్నారు.

అన్నిదానాల్లో విద్యాదానం గొప్పది

● రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్



అంగన్‌వాడీ కేంద్రాలకు బ్లాక్‌బోర్డ్, పుస్తకాలు అందజేస్తున్న రాజ్యసభ సభ్యులు కె.లక్ష్మణ్, బీజేపీ ప్రధానకార్యదర్శి మేకల సారంగపాణి

బౌద్ధనగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): అన్నిదానాల్లో కంటే విద్యాదానం గొప్పదని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. మంగళవారం పార్శిగుట్ట కమ్యూనిటీ హాలులో బీజేపీ మహిళా నాయకురాలు మేకల కీర్తిహర్షకిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లుకు బ్లాక్‌బోర్డులు, పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ దేశంలో ఉత్తమవిద్యను అందించటమే లక్ష్యంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పనిచేస్తున్నారన్నారు. పేదలను ఉన్నతస్థాయికి తీసుకువెళ్లాడానికి విద్య ఎంతో అవసరమన్నారు. పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉన్నత స్థానాలకు వెళ్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహంకాళి జిల్లా ప్రధానకార్యదర్శి మేకల సారంగపాణి, ఉపాధ్యక్షుడు రాచమల్ల కృష్ణమూర్తి, కన్వీనర్ కందాడి నాగేశ్వరరెడ్డి, కనకట్ల హరి, శారదామల్లేష్, అంబాల రాజేశ్వరరావు, వేణుయాదవ్, ఆకారం రమేష్, వెంకటేశ్‌గౌడ్, పోచయ్యయాదవ్ పాల్గొన్నారు.

బోనాల చెక్కుల పంపిణీలో ప్రొటోకాల్ రగడ

● సీతాఫల్‌మండి మల్టీపర్పస్ ఫంక్షన్‌హాలులో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల బాహాబాహి

● ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకుల అరెస్ట్



సీతాఫల్‌మండి మల్టీపర్పస్ ఫంక్షన్‌హాలులో వాగ్వివాదం చేసుకుంటున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు

బౌద్ధనగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆషాఢమాస బోనాల జాతరకు సంబంధించి సీతాఫల్‌మండి మల్టీపర్పస్ ఫంక్షన్‌హాలులో మంగళవారం నిర్వహించిన దేవాదాయశాఖ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ప్రొటోకాల్ రగడ వివాదానికి దారితీసింది. సికింద్రాబాద్ శాసనసభ్యుడు తీగుళ్ల పద్మారావుగౌడ్‌ను ఆహ్వానించలేదని, బ్యానర్‌లో ఎమ్మెల్యే ఫొటోను ముద్రించలేదని కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు దేవాదాయశాఖ అధికారులను నిలదీశారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు బాహాబాహీకి తలపడడంతో ఉద్రిక్తత్తకు దారితీసింది. టీపీసీసీ కార్యదర్శి ఆదం సంతోష్‌కుమార్ స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్లకు సమాచారమందించామని, శాంతియుతంగా చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగేలా చూడాలని బీఆర్ఎస్ నాయకులను సముదాయించారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, సునీత, ప్రసన్నలక్ష్మి, బీఆర్ఎస్ యూత్ నాయకుడు ఆలకుంట హరి, నాయకులు, కార్యకర్తలు, మహిళలు చెక్కుల పంపిణీ చేసే స్థలం వద్ద బైఠాయించి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎమ్మెల్యే ఫొటోలేని బ్యానర్లను తీయించి వేశారు. ఒక సందర్భంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు బాహాబాహీకి తలపడ్డాయి. దీంతో రంగంలోకి దిగిన చిలకలగూడ డివిజన్ ఏసీపీ జైపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు అనుదీప్, కరుణాకర్‌రెడ్డి సిబ్బందితో బీఆర్ఎస్ నాయకులను బయటకు పంపించివేశారు. ఆందోళన చేస్తున్న యూత్ లీడర్స్ ఆలకుంట హరి, బెజ్జంకి రాజేష్, సునీల్‌ముదిరాజ్ పాకసాయి, లింగాని శ్రీనివాస్‌తో పాటు పదిహేను మంది బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేసి నల్లకుంట పోలీస్‌స్టేషన్‌కు తరలించి సాయంత్రం పూచీకత్తుపై విడుదల చేశారు. బోనాల పండుగను సంతోషంగా చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ రామకృష్ణ, అడిషనల్ కమిషనర్ సంధ్యారాణి, ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి, మంజుల, జగపతితోపాటు నాయకులు మాజీ కార్పొరేటర్ కందినారాయణ, జలంధర్‌రెడ్డి, కొండల్ వెంకటేశ్వరరావు, అనిల్, స్టాలిన్, తదితరులు పాల్గొన్నారు.

అరెస్టు అన్యాయం

కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రొటోకాల్ పాటించకుండా కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తున్న తీరు పూర్తిగా అప్రజాస్వామికంగా ఉందని అడ్డగుట్ట డివిజన్ కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి అన్నారు. మంగళవారం సికింద్రాబాద్ నియోజకవర్గం సీతాఫల్‌మండిలో ఆలయాలకు సంబంధించిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుల తీరును ఆమె తీవ్రంగా ఖండించారు. ప్రొటోకాల్ పాటించాలని అన్నందుకు బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేస్తారా, ఇదెక్కడి న్యాయమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని

మారేడుపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని లబ్ధిపొందాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. మంగళవారం వెస్ట్ మారేడుపల్లిలోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అమీర్‌పేట్ మండల పరిధిలోని 29 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషు కుమారి, తహసీల్దార్ భీమయ్య, బీఆర్ఎస్ పార్టీ నాయకులు అశోక్ యాదవ్, ప్రవీణ్ రెడ్డి, కూతురు నర్సింహ, బన్సీలాల్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, ఏసూరి మహేష్, కుర్మ లక్ష్మీపతి, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులలో నాణ్యత పాటించాలి

మౌలాలి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని డీఈ మహేష్ కాంట్రాక్టర్లకు సూచించారు. మౌలాలి డివిజన్ హన్‌మాన్‌నగర్‌లో నూతనంగా వేస్తున్న సీసీ రోడ్డు పనులను ఏఈ మధురిమతో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా త్వరితగతిన పనులను పూర్తిచేయాలని ఏఈని ఆదేశించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మోహన్ యాదవ్, రాకేష్, కిరణ్‌శేఖర్, సంతోష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

డాక్టర్ శిల్పారెడ్డి

హైదరాబాద్ సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రతీ పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలలను ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకొని పోలీస్ స్టేషన్ల ద్వారా సమీక్షించాలని ఆమె అన్నారు. బోడుప్పల్లో ఓ ప్రైవేట్ అంతర్జాతీయ పాఠశాలలో డాన్స్ టీచర్‌గా పని చేస్తున్న వ్యక్తి ఒకటో తరగతి చదువుతున్న విద్యార్థినిపై లైంగిక దాడి జరిగిన విషయం తెలుసుకుని మంగళవారం అక్కడికి వెళ్లి పరిస్థితులను తెలుసుకున్నారు. పాఠశాల ప్రాంగణంలో విద్యార్థుల రక్షణ కోసం ఉండాల్సిన సీసీ కెమెరాలు, సెక్యూరిటీ లేదని ఆమె పేర్కొన్నారు. విద్యార్థినుల విషయంలో ముఖ్యమైన జాగ్రత్తలు కూడా పాఠశాలల యాజమాన్యాలు తీసుకోకపోవడంతోనే వారిపై లైంగిక దాడులు పునరావృతం అవుతున్నాయని ఆమె అన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో తల్లిదండ్రులతో కలిసి ఒక కమిటీని ఏర్పాటు చేయాలని, ఆ కమిటీ ద్వారా పిల్లలకు సంబంధించిన సమస్యలను వెంటనే స్కూలు యాజమాన్యాలకు చేరవేసేలా ఉండాలన్నారు.